సాక్షి
చిత్తూరు

గురువారం । 11 । జూలై । 2024



తప్పిన పెను ప్రమాదం

విద్యార్థులను ఇంటి వద్ద దించేందుకు అతివేగంతో వెళుతున్న స్కూల్ బస్సు అదుపు తప్పి పొలాల్లోకి వెళ్లి ఆగిపోయింది. - 8లో



ధరల నియంత్రణకు చర్యలు

నిత్యావసరాల ధరల నియంత్రణకు చర్యలు చేపట్టినట్లు జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు వెల్లడించారు. - 8లో



చోరీ కేసుల్లో ఆరుగురి అరెస్టు

వేర్వేరు ప్రాంతాల్లో బైక్, టెంపో చోరీ కేసుల్లో ఆరుగురిని పోలీసులు అరెస్టు చేసి, వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. - 8లో

న్యూస్‌రీల్

వైఎస్సార్‌సీపీ శ్రేణులకు అండగా..



బాధితులకు చెక్కును పంపిణీ చేస్తున్న సునీల్‌కుమార్

పూతలపట్టు: టీడీపీ నాయకుల దాడిలో నష్టపోయిన, గాయపడిన వైఎస్సార్‌సీపీ శ్రేణులకు పార్టీ అండగా నిలబడుతోంది. బాధితులకు బుధవారం పార్టీ తరపున నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ సునీల్‌కుమార్ చెక్కును అందజేశారు. మండలంలోని వావిల్‌తోటలో బాధితులను పరామర్శించారు. బాధితులే హరిబాబు, శ్రీకాంత్‌రెడ్డి, కిరణ్‌కుమార్, ఉమాపతినాయుడుకు ఒక్కొక్కరికి రూ.లక్ష, హరిష్, హరి, నవీన్‌రెడ్డి, నిరంజన్‌కు ఒక్కొక్కరికి రూ.50 వేల చెక్కును అందజేసినట్లు తెలిపారు. కష్టకాలంలో పార్టీ అధిష్టానం కార్యకర్తలకు అండగా ఉంటుందని బాధితులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ కన్వీనర్ శ్రీకాంత్‌రెడ్డి, వైస్ ఎంపీపీ మురళీకృష్ణ, మండల సోషల్ మీడియా కన్వీనర్ నవీన్‌రెడ్డి పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యలు పరిష్కరిస్తాం



ఫిర్యాదులు స్వీకరిస్తున్న డీఈ జ్ఞానేశ్వర్

చిత్తూరు కార్పొరేషన్: విద్యుత్ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఎస్ఈ సురేంద్రనాయుడు తెలిపారు. జిల్లాలో బుధవారం ఈఈ కార్యాలయాల్లో నిర్వహించిన విద్యుత్ సమస్యల పరిష్కారవేదికలో మొత్తం 41 సమస్యలు వచ్చాయని చెప్పారు. అందులో 18 సమస్యలను పరిష్కరించినట్లు వివరించారు. మిగిలినవి ఆర్థిక పరమైన అంశాలున్నందున వాటికి అనుమతులు తీసుకొని పరిష్కరిస్తామన్నారు. బిల్లింగ్ సమస్యలు, కేబుల్, విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్ల మార్పు, ఏర్పాటు, వంటి సమస్యలపై అర్జీలు వచ్చినట్లు చెప్పారు. చిత్తూరులో ఫిర్యాదులను డీఈ జ్ఞానేశ్వర్ స్వీకరించారు.

కడా ప్రత్యేక అధికారిగా వికాస్



వికాస్ మర్మత్

కుప్పం: కుప్పం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (కడా) ప్రత్యేక అధికారిగా ఐఏఎస్ అధికారి వికాస్ మర్మత్ నియమితులయ్యారు. ఆయన నెల్లూరు కార్పొరేషన్ చైర్మన్‌గా పనిచేస్తున్నారు. త్వరలో ఆయన కుప్పంలో బాధ్యతలు స్వీకరించనున్నారు.

పకడ్బందీగా పరీక్షల నిర్వహణకు కృషి



బాధ్యతలు స్వీకరిస్తున్న పరశురాం నాయుడు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా వ్యాప్తంగా పాఠశాల స్థాయిలో అన్ని పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు కృషి చేస్తానని జిల్లా ఉమ్మడి పరీక్షల విభాగం సెక్రటరీ పరశురాం నాయుడు అన్నారు. జిల్లా కేంద్రంలోని పీసీఆర్ ప్రభుత్వ పాఠశాలలో ఉన్న డీసీఈబీ కార్యాలయంలో ఆయన బాధ్యతలు స్వీకరించారు. పూర్వ సెక్రటరీ హేమారెడ్డి నూతన సెక్రటరీకి బాధ్యతలు అప్పజెప్పారు. ఈ మేరకు పరశురాం విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలోని అన్ని యాజమాన్య పాఠశాలల్లో ఫార్మేటివ్, సమ్మేటివ్ పరీక్షలను కట్టుదిట్టంగా నిర్వహించేందుకు చర్యలు చేపడతానని తెలిపారు. ప్రతి ఏటా ఉమ్మడి పరీక్షల విభాగం ఆధ్వర్యంలో తయారు చేసే పదవ తరగతి స్టడీ మెటీరియల్‌ను నిష్ణాతులైన ఉపాధ్యాయులతో త్వరితగతిన సిద్ధం చేయిస్తానన్నారు. అనంతరం పలువురు అధికారులు ఆయన్ను కలిసి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది రెడ్డిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పద్మ అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

తిరుపతి కల్చరల్: భారత ప్రభుత్వం 2025 జనవరి 26 గణతంత్ర దినోత్సవం రోజున ప్రకటించే పద్మ అవార్డులకు సంబంధించి వివిధ రంగాలలో ప్రతిభ కలిగిన వారు దరఖాస్తు చేసుకోవచ్చని సెట్విన్ సీఈఓ డాక్టర్ వి.మురళీకృష్ణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన అభ్యర్థులు ఆన్‌లైన్‌లో రాష్ట్రీయ పురస్కార్ పోర్టల్ https://awards.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఇందు కోసం www.padmaawards.gov.in వెబ్‌సైట్‌లో మొదటగా అభ్యర్థులు పేర్లు నమోదు చేసుకోవాలని తెలిపారు. లేదా సెట్విన్ కార్యాలయం, అలిపిరి రోడ్డు, తిరుపతి చిరునామాలో ఈనెల 22వ తేదీలోపు అందజేయాలని కోరారు. మరిన్ని వివరాలకు ఆ వెబ్‌సైట్ చూడవచ్చని, ఇతర వివరాలకు 0877–2286921, 94405 73537ను సంప్రదించాలని తెలియజేశారు.

ఇసుకాసురులు

చిత్తూరు రూరల్ మండలం పాలూరు స్టాక్ పాయింట్ వద్ద ఇసుక తరలించడానికి సిద్ధంగా ఉన్న ట్రాక్టర్



టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఉచిత ఇసుక అంటూనే అధికార పార్టీ శ్రేణులు లూటీకి తెరదీశారు. గతంలో దోచుకున్నట్లుగానే మళ్లీ మొదలెట్టారు. తెల్లబంగారంగా పేరొందిన ఇసుకను స్టాక్ పాయింట్ల నుంచే రాత్రి వేళల్లో యథేచ్ఛగా తమ ప్రైవేటు భూముల్లోకి తరలించేశారు. సుమారు లక్షల టన్నులకు పైగా ఇసుకను తీసుకెళ్లిపోయారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరతోపాటు తమకూ పన్ను చెల్లిస్తేనే ఇసుక ట్రాక్టర్ లోడ్ ఎక్కుతుందని హుకుం జారీ చేశారు. నిషేధిత ప్రాంతాల్లో తవ్వకాలు చేస్తూ పర్యావరణానికి హాని కలిగిస్తున్నారు. దీనిపై అధికారులు కనీస చర్యలు తీసుకోవడానికి సాహసించలేక చోద్యం చూస్తున్నారు.

- స్టాక్ పాయింట్ల నుంచే టీడీపీ లూటీ
- ప్రభుత్వం నిర్ణయించిన ధర రూ.1,200
- తెలుగుతమ్ముళ్ల వాటా ట్రాక్టర్‌కు రూ.1,000 అదనం
- రవాణా ఖర్చుతో కలిపి మొత్తంగా ట్రాక్టర్ ఇసుక రూ.3,000

సాక్షి టాస్క్‌ఫోర్స్: చిత్తూరు జిల్లాలో అధికార పార్టీ శ్రేణులు ఇసుక లూటీ మొదలెట్టేశారు. గత ఐదేళ్లా ఒక క్రమ పద్ధతిలో సాగిన ఇసుక విక్రయానికి స్వస్తి పలికారు. స్టాక్ పాయింట్ల నుంచే లక్షలాది టన్నుల ఇసుకను యథేచ్ఛగా తరలించేశారు. జిల్లాలో కుప్పం నుంచి నగరి వరకు ఆయా ప్రాంతాల్లోని నదులు, వాగులు, వంకల్లో ఇసుక పుష్కలంగా లభ్యమవుతోంది. భూగర్భ వనరులశాఖ నిబంధనలకు లోబడి రీచ్‌ల నుంచి ఇసుక తోడుకుని స్టాక్ పాయింట్ల వద్ద నిల్వ చేస్తారు. మిగిలిన ప్రాంతాల్లో ఇసుక తవ్వకాలు నిషేధం. కానీ, టీడీపీ నేతలు ఇసుక అక్రమ రవాణానే ప్రధాన వ్యాపారంగా మార్చుకున్నారు. అందులోనూ నిషేధిత మండల ప్రాంతాల్లో రాత్రి, పగలూ తేడా లేకుండా భారీ జేసీబీలు, ఇతర యంత్రాలతో ఇసుక తవ్వకాలు జరుపుతున్నారు. కొన్ని ప్రాంతాల్లో పరిమితికి మించి తవ్వకాలు చేస్తుండడంతో ఆయా ప్రాంతాల వారు ఆందోళన చెందుతున్నారు. దీనిపై ప్రశ్నిస్తే బెదిరింపులకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పూతలపట్టు మండలం వేపనపల్లిలో భారీ జేసీబీలు, పదుల సంఖ్యలో ట్రాక్టర్లతో ఇసుకను తరలిస్తున్నారు. దీనిపై మండల జిల్లా స్థాయిలో అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకునే దిక్కు లేదు. దీంతో ఏకంగా జిల్లా కలెక్టర్‌కే ఫిర్యాదు చేశారు. ఇలా జిల్లాలో ఇసుక అక్రమ తవ్వకాలు ఏస్థాయిలో జరుగుతున్నాయో అర్థమవుతుంది.

మూడు స్టాక్ పాయింట్లే

ప్రస్తుతం జిల్లాలో చిత్తూరు రూరల్ మండలం పరిధిలోని దిగువమాసపల్లి, పాలూరుతోపాటు పలమనేరు నియోజకవర్గం పరిధిలోని బైరెడ్డిపల్లి క్రాస్ వద్ద మాత్రమే స్టాక్ పాయింట్లు ఉన్నాయి. ఈ మూడు స్టాక్ పాయింట్లు మాత్రమే అధికారికంగా ప్రభుత్వం ప్రకటించింది. ప్రభుత్వ నిబంధన ప్రకారం చిత్తూర్ రూరల్ పరిధిలోని స్టాక్ పాయింట్లలో టన్నుకు రూ.155 , బైరెడ్డిపల్లి గ్రాస్ స్టాక్ పాయింట్ వద్ద టన్నుకు రూ.200 సీనరేజ్ చార్జీలతో చెల్లించి ఇసుక పొందే అవకాశం ఉంది.

టీడీపీకి ట్యాక్స్ కట్టాల్సిందే

ప్రభుత్వ నిబంధన ప్రకారం సీనరేజ్‌తోపాటు దూరాన్ని బట్టి రవాణా చార్జీలు చెల్లిస్తే ఆయా స్టాక్ పాయింట్ల వద్ద ఇసుక పొందవచ్చు. కానీ, ప్రత్యేకంగా టీడీపీ శ్రేణులకూ ట్యాక్స్ కట్టందే ఇసుక ట్రాక్టర్‌కు లోడ్ ఎక్కడం లేదని వినియోగదారులు వాపోతున్నారు. సాధారణంగా ఒక ట్రాక్టర్‌కు కనీసం 5 టన్నులు ఉంటేనే లోడ్ అవుతుంది. అలా టన్నుకు రూ.200 చొప్పున ఐదు టన్నులకు రూ.1000 చెల్లించాలి. ఇక రవాణా చార్జీలు, దూరం ప్రాంతం పేరుతో ఒక ట్రాక్టర్ కనిష్టంగా రూ.3 వేలు చెల్లించాల్సిన పరిస్థితి ఎదురవుతోందని బాధితులు చెబుతున్నారు. ఇలా ఇసుక స్టాక్ పాయింట్ల వద్ద మధ్యవర్తులుగా వ్యవహరిస్తున్న టీడీపీ శ్రేణులకు కాసుల వర్షం కురిపిస్తోంది.



నదిలో నుంచి తరలిపోతున్న ఇసుక

భారీగా తగ్గిన ఇసుక నిల్వలు

గతంలో చిత్తూరు వ్యాప్తంగా మొత్తం 16 ఇసుక రీచ్‌లు, 7 స్టాక్ పాయింట్లు నిర్వహించేవారు. ప్రస్తుతం కొత్త ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. కేవలం మూడు స్టాక్ పాయింట్లు మాత్రమే తెరిచింది. ఇంకేముంది వచ్చీరాగానే అధికార పార్టీ శ్రేణుల కన్ను ఇసుక నిల్వలపై పడింది. ఫలితంగా నెల రోజుల్లోనే జిల్లాలోని ఇసుక నిల్వలు ఎక్కడికక్కడ తరలించేశారు. దీంతో స్టాక్ పాయింట్లు ఇసుక నిల్వలు లేక బోసిపోయాయి. గతంలో జిల్లాలో ఇసుక నిల్వలు 3,03,280 టన్నులు ఉండగా, ప్రస్తుతం మొత్తం 1.9 లక్షల టన్నులు మాత్రమే ఉన్నాయి. దిగువమాసపల్లిలో 2 లక్షల టన్నులు ఉండగా ప్రస్తుతం 1.60 టన్నులు, పాలూరులో లక్ష టన్నులకు గాను, కేవలం 30వేల టన్నులు మిగిలిఉంది. బైరెడ్డిపల్లి క్రాస్ వద్ద మొత్తం 3,280 టన్నులు ఉండగా ప్రస్తుతం 350 టన్నులు మాత్రమే ఉంది.



పూతలపట్టు మండలంలో అక్రమంగా ఇసుక తరలిస్తున్న వాహనాలు

నోరు మెదపని అధికారగణం

జిల్లాలో ఇసుక దోపిడీ యథేచ్ఛగా సాగుతోంది. ఉచిత విధానం పేరుతో స్టాక్ పాయింట్ల వద్ద ఇసుక ఖాళీ అవుతోంది. సొమ్ము టీడీపీశ్రేణుల జేబుల్లోకి వెళుతోంది. మరోవైపు నిషేధిత నదీ పరీవాహక ప్రాంతాలు, వాగుల్లో ఇసుక అక్రమ తవ్వకాలు జోరందుకున్నాయి. భారీ యంత్రాలతో తవ్వేస్తున్నారు. దీనిపై అధికారులకు రోజువారీగా ఫిర్యాదులు అందుతున్నాయి. అయినప్పటికీ సంబంధిత అధికారులు నోరు మెదపడం లేదు. సంబంధిత భూగర్భ గనుల శాఖ అధికారులు ఏమాత్రం పట్టించుకోవటం లేదు. రాతపూర్వకంగా, ఆధారాలతో ఫిర్యాదులు చేసినప్పటికీ ఆయా ప్రాంతాలను సందర్శించిన దాఖలాలు లేవు. ఆరంభంలోనే ఇలా ఉంటే రాబోయే రోజుల్లో పరిస్థితి ఎలా ఉంటుందోనని వినియోగదారులు బెంబేలెత్తిపోతున్నారు.

ఉచిత ఇసుకకు మంగళం

నిర్మాణ పనులు మరింత వేగవంతం చేయటం, భవన కార్మికులకు అండగా ఉండడం, వినియోగదారులకు ఎలాంటి లాభాపేక్ష లేకుండా ఇసుక అందించేలా ఉచిత ఇసుక విధానాన్ని రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తోంది. కానీ, క్షేత్రస్థాయిలో అది అమలు కావడం లేదు. వినియోగదారునిపై భారం అధికంగా పడుతోంది. ఒక్క ట్రాక్టర్ ఇసుక పొందాలంటే కనిష్టంగా రూ.3వేలు చెల్లించాల్సి వస్తోంది. గతంలో ప్రభుత్వ నిబంధనలకు లోబడి ఇసుక కోసం స్టాక్ వినియోగదారుడు చెల్లించే నగదు మొత్తం ఎలాంటి మధ్యవర్తుల ప్రమేయం లేకుండానే ప్రభుత్వ ఖాతాలో జమ అయ్యేది. కానీ, ప్రస్తుతం ఇసుక విధానంలో మధ్యవర్తులుగా ఉండే కూటమి పార్టీ నేతల జేబులు నిండుతున్నాయనే విమర్శలు జోరందుకున్నాయి.

అర్జీల పర్యవేక్షణకు బృందం ఏర్పాటు



సమీక్షకు హాజరైన అధికారులు



సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్‌కుమార్‌గాంధీ

చిత్తూరు కలెక్టరేట్: ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో అందిన అర్జీల పర్యవేక్షణకు ప్రతి శాఖలో ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసుకోవాలని కలెక్టర్ సుమిత్‌కుమార్‌గాంధీ ఆదేశించారు. ఆయన బుధవారం కలెక్టరేట్‌లో పలు శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ సీఎం కుప్పం పర్యటనలో అందిన అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలన్నారు. అర్జీల పరిష్కారానికి తీసుకుంటున్న చర్యలపై ఎండార్స్‌మెంట్ ఇవ్వాలని కోరారు. అర్జీల పరిష్కారంలో అలసత్వం వహించకూడదని చెప్పారు. ప్రతి వారం ప్రజాసమస్య పరిష్కార వేదికలో అందే అర్జీల పరిష్కారంపై సమీక్ష ఉంటుందని తెలిపారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు, డీఆర్‌ఓ పుల్లయ్య, డ్వామా పీడీ రాజశేఖర్ పాల్గొన్నారు.

ఎంఈఓలు బడులను తనిఖీ చేయాలి

జిల్లా వ్యాప్తంగా ఎంఈఓలు ప్రతి రోజూ తప్పనిసరిగా బడులను తనిఖీ చేయాలని కలెక్టర్ సుమిత్‌కుమార్‌గాంధీ ఆదేశించారు. ఆయన బుధవారం కలెక్టరేట్‌లో విద్యాశాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. విద్యార్థుల అభ్యసనా సామర్థ్యాల పెంపునకు ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. మధ్యాహ్నభోజనం పథకాన్ని పకడ్బందీగా అమలు చేయాలన్నారు. ఎంఈఓలు ప్రతి రోజు ఒక పాఠశాలను తనిఖీ చేసి సమగ్రంగా అక్కడ అమలవుతున్న విధానాలను గమనించాలని కోరారు. తనిఖీలో విద్యార్థులు, తల్లిదండ్రులతో తప్పనిసరిగా మాట్లాడాలని తెలిపారు. లోటుపాట్లు ఏవైనా ఉంటే సరిదిద్దాలని చెప్పారు. సర్కారు బడుల్లో చదివే విద్యార్థులతో తానే స్వయంగా మాట్లాడే కార్యక్రమం చేపడతానని తెలిపారు. విద్యార్థులందరికీ తప్పనిసరిగా పాఠ్యపుస్తకాలు, ఇతర విద్యాసామగ్రి అందజేయాలన్నారు. బడి బయట పిల్లలను బడిలో చేర్పించేందుకు చర్యలు చేపట్టాలని చెప్పారు. విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. ఈ సమీక్షలో డీఈఓ దేవరాజు, ఏపీసీ వెంకటరమణారెడ్డి, డీవైఈఓ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

అధికారులు సమన్వయంతో పనిచేయండి



సమీక్షలో మాట్లాడుతున్న చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా వ్యాప్తంగా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో విధులు నిర్వహించాలని చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు అన్నారు. జిల్లాలోని పలు శాఖల అధికారులతో బుధవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ సుమిత్‌కుమార్ గాంధీ అధ్యక్షతన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎంపీ మాట్లాడుతూ జిల్లా సమగ్రాభివృద్ధికి అందరూ కలిసికట్టుగా పనిచేయాలని సూచించారు. ఎంపీ నిధులతో చేపట్టే పనుల్లో నాణ్యత లోపించకూడదని ఆదేశించారు. ఎంపీ నిధుల విధి విధానాలను తప్పకుండా పాటించాలన్నారు. కలెక్టర్ సుమిత్‌కుమార్‌గాంధీ మాట్లాడుతూ అన్ని శాఖల అధికారులు అలసత్వం లేకుండా విధులు నిర్వహించాలని సూచించారు. విధుల పట్ల అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కేంద్ర ప్రభుత్వ నిధులతో జిల్లాలో చేపడుతున్న పథకాలను పకడ్బందీగా అమలు చేయాలన్నారు. ఈ సమీక్షలో జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు, డీఆర్‌ఓ పుల్లయ్య, డ్వామా పీడీ రాజశేఖర్, ఇతర శాఖల అధికారులు విజయ్‌కుమార్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, రాజ్యలక్ష్మీ, రాధమ్మ, తులసి, పద్మనాభం పాల్గొన్నారు.

శ్రీవారి దర్శనానికి 10 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 14 కంపార్ట్‌మెంట్లు నిండాయి. మంగళవారం అర్ధరాత్రి వరకు 67,245 మంది స్వామివారిని దర్శించుకున్నారు. 28,054 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. శ్రీవారికి హుండీ ద్వారా రూ.4.51 కోట్ల ఆదాయం వచ్చింది. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. టికెట్లు లేని వారికి 10 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ టికెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనమవుతోంది.

మీరా.. నేనా!

- తిరుపతిలో చిత్తూరు నేతలదే పెత్తనం
- ఎమ్మెల్యే చెప్పినట్టు నడుచుకోవాల్సిందే
- పార్టీ గెలుపు కోసం కష్టపడింది మేమే
- పదవులు జనసేన వారికే కట్టబెట్టాలి
- గెలుపు కోసం తామూ పనిచేశామంటున్న టీడీపీ, బీజేపీ
- తిరుపతి కూటమిలో ఎవరి దారి వారిదే!



సాక్షి, తిరుపతి: అధికారంలోకి వచ్చి నెల కూడా గడవక ముందే కూటమిలో ఆధిపత్యపోరు తారస్థాయికి చేరింది. తమ మాటే చెల్లుబాటు కావాలని ఎవరికి వారు పెత్తనం చెలాయిస్తున్నారు. ప్రధానంగా ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు పేరు చెప్పి బంధువులు, చిత్తూరుకు చెందిన వారు తిరుపతిలో పెత్తనం చెలాయిస్తుండడంపై స్థానిక కూటమి నేతలు మండిపడుతున్నారు. తిరుపతికి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులా? సుగుణమ్మ, కిరణ్‌రాయలా? లేదా మిగిలిన వారా? అంటూ చిత్తూరు నుంచి నగరంలో తిష్టవేసిన వారు స్థానిక నాయకులను ప్రశ్నిస్తున్నారు. దీనికి రెండు రోజుల క్రితం క్లస్టర్ సమావేశంలో ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, జనసేన నాయకుడు కిరణ్‌రాయల్ మధ్య జరిగిన వాగ్యుద్ధమే నిదర్శనం. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వంలోని నాయకులు తిరుపతి అభివృద్ధిపై దృష్టి సారించడానికి బదులు ప్రభుత్వ కార్యాలయాలు, ప్రైవేటు సంస్థలతో పాటు ఇంటాబయట తమ మాటే చెల్లుబాటు కావాలని ఆధిపత్యం కోసం వెంపర్లాడుతున్నారు. తానే ఎమ్మెల్యేనంటూ ఎవరికి వారు పెత్తనం చెలాయిస్తున్నారని ఆరణి శ్రీనివాసులు వర్గీయులు చిర్రెత్తిపోతున్నారు! ఆరణి గెలుపు కోసం కష్టపడింది తాము అని, స్థానిక నాయకులను కాదని చిత్తూరు నుంచి వచ్చిన వారికి పెత్తనమివ్వడం ఏమిటని తిరుపతికి చెందిన కూటమి నేతలు కస్సుబుస్సుమంటున్నారు. నగరాభివృద్ధికి కృషి చేయటం మాని ఎవరికి వారే యమునా తీరే అనే విధంగా కూటమి నేతలు వ్యవహరిస్తుండడంతో ప్రజల్లో వీరి తీరుపై అప్పుడే చర్చ మొదలైంది.

స్థానిక నాయకులంటే చులకనా?

టీడీపీ, బీజేపీ నేతల సహకారంతో గెలిచిన జనసేన అభ్యర్థి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు అన్ని పార్టీలనూ కలుపుకుపోయేందుకు ఆసక్తి చూపడం లేదనే ప్రచారం జరుగుతోంది. కనీసం ప్రొటోకాల్ లిస్ట్ కూడా తయారు చేయకుండా, స్థానిక నాయకులెవ్వరినీ కార్యక్రమాలకు ఆహ్వానించకుండా 'నేనే' అనే ధోరణిలో ఎమ్మెల్యే ముందుకు వెళ్తున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. నియోజకవర్గ పరిధిలోని వివిధ శాఖల అధికారుల బదిలీలు, ఉద్యోగోన్నతుల కోసం ఎమ్మెల్యేను సిఫార్సుల కోసం ఆశ్రయించడం పరిపాటి. కానీ ఎమ్మెల్యే ఆరణి ఇప్పటివరకు ఏ ఒక్క ఉద్యోగికీ సిఫార్సు లేఖ ఇవ్వకపోగా.. లేఖల కోసం చిత్తూరు నుంచి దిగుమతి చేసుకున్న వారి వద్దకు వెళ్లి కలవండి అని చెప్పి పంపడంపై స్థానిక నాయకుల్లో అసంతృప్తిని రాజేసింది.


అధినాయకులకు ఫిర్యాదుల వెల్లువ

తిరుపతి కూటమి నేతలు ఒకరిపై మరొకరు తమ పార్టీ అధినాయకులకు ఫిర్యాదులు చేస్తున్నారు. ఎమ్మెల్యేపై జనసేనలోనే కొందరు నాయకులు పవన్‌కళ్యాణ్‌కు ఫిర్యాదు చేస్తుంటే, తానూ తక్కువేమీ కాదని స్థానిక జనసేన నాయకులపైనా ఎమ్మెల్యే ఫిర్యాదు చేసినట్లు విశ్వసనీయ సమాచారం. ఇటీవల తిరుపతి కార్పొరేషన్‌లో ఎమ్మెల్యేకు బదులు ఆయన అన్న కుమారుడు అధికారిక సమావేశంలో పాల్గొనడం, రాష్ట్ర పర్యాటక శాఖా మంత్రి అధికారిక కార్యక్రమంలోనూ జనసేన నాయకులు పలువురు హాజరై దిశానిర్దేశం చేయటంపై విమర్శలు వెల్లువెత్తాయి. వీటిని దృష్టిలో ఉంచుకుని రెండ్రోజుల క్రితం జనసేన నాయకుడు కిరణ్‌రాయల్ ఎమ్మెల్యే గురించి పలు వ్యాఖ్యలు చేశారు. దీనికి ప్రతిగా ఎమ్మెల్యే ఆరణి కూడా కౌంటర్ ఇవ్వడంతో తిరుపతి కూటమిలో విభేదాలు బట్టబయలయ్యాయి. ఎన్నికల ముందు నుంచి ఉన్న విభేదాలు మరోసారి బహిర్గతమయ్యాయి.

నామినేటెడ్ పదవుల కోసం పైరవీలు

కూటమి అధికారంలోకి వచ్చి నెలరోజులు కూడా కాకమునుపే తిరుపతిలో నామినేటెడ్ పదవుల కోసం పెద్ద ఎత్తున ప్రయత్నాలు సాగిస్తున్నారు. పలువురు ఈ పోస్టుల కోసం ఆశగా ఎదురుచూస్తున్నారు. వాస్తవంగా పార్టీ గెలుపు కోసం కష్టపడిన వారిని సిఫార్సు చేయకపోవడంపై స్థానిక నాయకులు తీవ్ర అసంతృప్తితో లో..లోపల రగిలిపోతున్నారు. ఇక లాభం లేదని వారంతా పార్టీ అధిష్టానం దృష్టిలో పడేందుకు ఎవరికి వారు పైరవీలు మొదలుపెట్టారు. తుడా చైర్మన్, టీటీడీ పాలక మండలి సభ్యుల పదవిని ఆశిస్తున్న కిరణ్ రాయల్ వైఎస్సార్‌సీపీ నేతలను విమర్శిస్తే పదవి దక్కుతుందని ఉద్దేశంతో ఆ దిశగా అడుగులు వేస్తున్నారు. ఈ విమర్శలకు సంబంధించి ఎక్కడా స్థానిక ఎమ్మెల్యేకు సంబంధం లేకుండా ప్రెస్‌మీట్లు నిర్వహిస్తుండడంపై ఎమ్మెల్యే వర్గీయులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మరో వైపు డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్, కీర్తన తదితరులు ఇదే బాటలో పయనించకున్నప్పటికీ పార్టీలో తమకున్న పరపతిని ఉపయోగించుకుని పదవుల కోసం సిఫార్సులు చేయించుకుంటున్నారు. ఈ పరిణామాల క్రమంలో టీడీపీ నేతలు గ్రూపులు కట్టడంపై ఎమ్మెల్యే ఆరణి అమరావతిలోని టీడీపీ కేంద్ర కార్యాలయానికి ఫిర్యాదు చేసినట్లు విశ్వసనీయ సమాచారం. ఒకరిద్దరు నాయకులు తిరుమల కొండపై తట్టలు పెట్టించడం, టీటీడీలో రెవెన్యూ పంచాయతీలో సిఫార్సులు చేయడం, ఒకరు చంద్రబాబు వద్ద మరొకరు నారా లోకేష్ వద్ద తమకు మంచి పలుకుబడి ఉందని అధికారుల వద్ద ప్రగల్భాలు పలుకుతూ తమ సొంత పనులను చక్కదిద్దుకునే పనిలో నిమగ్నమయ్యారు.

సచివాలయ సిబ్బందికి పారిశుధ్య పనులు



పిచ్చి మొక్కలను తొలగిస్తున్న సచివాలయ సిబ్బంది

కాణిపాకం: ఐరాల మండలంలోని పలువురు సచివాలయ సిబ్బందితో మండల అధికారులు పారిశుధ్య పనులు చేయిస్తున్నారు. ఉదయాన్నే రమ్మని ఊరంతా శుభ్రం చేయమంటున్నారు. గ్రామాల్లోని వీధుల్లో చెత్తను శుభ్రం చేయించడం, కాలువలు, నీటి ట్యాంకులు కడిగించడం, పిచ్చి మొక్కలు తొలగించడం వంటి పనులను చేయాలని సచివాలయ సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. మంగళవారం నుంచి 14 రోజుల పాటు పారిశుధ్య పనులు చేపట్టేలా షెడ్యూల్ ప్రకటించారు. 7 గంటల నుంచి 10 గంటల వరకు గ్రామాల్లో పారిశుధ్య పనులు చేసిన తర్వాతనే విధులకు హాజరు వేయాలని హుకుం జారీ చేశారు. డిజిటల్ అసిస్టెంట్ తప్ప మిగిలిన సిబ్బంది అందరూ పారిశుధ్య పనుల్లో నిమగ్నమయ్యారు. డ్యూటీ చార్ట్ ప్రకారం ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటలకు విధులు నిర్వహించాల్సి ఉండగా, అదనపు డ్యూటలు వేయడం ఏమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు. దీనిపై వారు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు.

క్లుప్తంగా

నాగరాళ్లు ధ్వంసం



ధ్వంసం అయిన నాగరాళ్లు

సదుం: పూజలు నిర్వహించే నాగరాళ్లను గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేసిన సంఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. గ్రామస్తుల కథనం మేరకు, మండలంలోని చెరుకువారి పల్లె గ్రామ సమీపంలో బొమ్మసముద్రం ఎల్లమ్మ ఆలయ ఆవరణలో రావి చెట్టు కింద ఉన్న నాగరాళ్ల విగ్రహాలను గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. ఈ సంఘటనపై గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం నిందితుడి అరెస్టు

చిత్తూరు అర్బన్: చిత్తూరు నగరంలో కర్ణాటక మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. ఎస్‌ఐ ప్రసాద్ కథనం మేరకు, టూ టౌన్ పోలీసులు బుధవారం సంతపేట, నీవానది పరివాహక ప్రాంతాల్లో తనిఖీలు చేపట్టారు. రంగాచారి వీధికి చెందిన కె.కుమార స్వామి (40) 250 కర్ణాటక మద్యం ప్యాకెట్లు కలిగి ఉండగా అతన్ని అరెస్టు చేశారు. నిందితున్ని న్యాయమూర్తి ఎదుట ప్రవేశపెట్టగా, ఆయన ఆదేశాలతో చిత్తూరులోని జిల్లా జైలుకు తరలించినట్లు ఎస్‌ఐ ప్రసాద్ తెలిపారు.

ఒక్క పత్రమైనా ఇవ్వండి సారూ..!

- జిల్లాలో జనన, మరణ ధ్రువీకరణ పత్రాల జారీకి బ్రేక్
- కార్పొరేషన్లు, మునిసిపాలిటీల్లో 20 వేల వరకు పెండింగ్
- కొత్త ప్రభుత్వం ఏర్పాటైనప్పటి నుంచి స్తంభించిన పత్రాల జారీ
- బడులు తెరవడంతో బర్త్ సర్టిఫికెట్ల కోసం అవస్థలు
- మౌనంగా అధికారులు, పాలకులు



చిత్తూరు కార్పొరేషన్ కార్యాలయంలో జనన మరణ ధృవీకరణ పత్రాల కోసం ప్రజల పాట్లు

చిత్తూరు అర్బన్: మునిసిపాలిటీలు, కార్పొరేషన్లలో జారీచేసే జనన ధృవీకరణ పత్రాల పంపిణీ ఆగిపోయింది. పాఠశాలలు తెరిచి నెల రోజులు కావాస్తోంది. పిల్లల్ని విద్యా సంస్థల్లో చేర్పించాలంటే తల్లిదండ్రులకు కావాల్సిన మొదటి పత్రం. పిల్లల జనన ధృవీకరణ పత్రం. నెలరోజులకు పైగా రాష్ట్ర వ్యాప్తంగా ఒక్క ధృవీకరణ పత్రం కూడా జారీ కాలేదు. జిల్లాలోని స్థానిక సంస్థల అధికారులకు విషయం తెలిసినా మౌనంగా ఉన్నారే తప్ప, కనీసం సమస్యను పరిష్కరించే ప్రయత్నం మాత్రం చేయడం లేదు.

నెల దాటినా మౌనం...

గత ప్రభుత్వంలో మునిసిపాలిటీలు, కార్పొరేషన్లలో ప్రజారోగ్య శాఖ విభాగం నుంచి జనన మరణ ధృవీకరణ పత్రాలు ప్రతీ రోజూ జారీ అయ్యేవి. మీ–సేవా కేంద్రాలు, సచివాలయాల్లో వీటిని పొందడానికి వినియోగదారులు దరఖాస్తు చేసుకుని రూ.100 – 150 వరకు రుసుము చెల్లించారు. అలా చెల్లించిన దరఖాస్తులు ఆయా మునిసిపాలిటీల్లోని ప్రజారోగ్య శాఖ విభాగంలో ఉన్న జనన మరణ ధృవీకరణ పత్రాల జారీ అధికారికి వస్తాయి. జనన ధృవీకరణ పత్రం కోసం బిడ్డ పుట్టిన తేదీని ఆస్పత్రులు ఇచ్చిన రికార్డులు పరిశీలించి ఆ తేదీ, బిడ్డ పేరిట పత్రాలు జారీ చేస్తారు. ఇదే పద్ధతిలో మృతి చెందిన వాళ్ల వివరాలు పరిశీంచి పత్రాజలు జారీ చేస్తారు. కానీ గతనెల 2వ తేదీ నుంచి జిల్లా వ్యాప్తంగా నాలుగు మునిసిపాలిటీలు, చిత్తూరు కార్పొరేషన్‌లో ఈ ప్రక్రియ స్తంభించిపోయింది. మీ–సేవా కేంద్రాల్లో దరఖాస్తులు అప్‌లోడ్ చేసి, వాటిని స్థానిక సంస్థలకు పంపుతున్నా, ఆ వివరాలు ఏపీ కూడా సంబంధిత అధికారికి ఆన్‌లైన్‌లో కనిపించడంలేదు. ఇదే సమయంలో గ్రామీణ ప్రాంతాల్లో పంచాయతీ కార్యాలయాల్లో జనన మరణ ధృవీకరణ పత్రాలు విరివిగా జారీ అవుతున్నాయి. ప్రభుత్వ ఆస్పత్రుల్లోనూ వీటి జారీకి ఎలాంటి ఆటంకాలు లేవు. కానీ మునిసిపాలిటీల్లో మాత్రం నెల రోజులకు పైగా ఇవి స్తంభించిపోయాయి.

తల్లిదండ్రుల ఇబ్బందులు

గంటలో పరిష్కారమయ్యే ఈ సమస్యకు నెల రోజులకు పైగా సమయం తీసుకోవడంతో తల్లిదండ్రులు ఇబ్బందులు పడుతున్నారు. పిల్లల్ని పాఠశాలల్లో చేర్పించడానికి తప్పనిసరిగా విద్యాసంస్థలు జనన ధృవీకరణ పత్రాలు అడుగుతున్నాయి. మునిసిపల్ అధికారులు వీటిని ఇవ్వకపోవడంతో తల్లిదండ్రులు రోజూ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. రాష్ట్ర ప్రజారోగ్యం–కుటుంబ సంక్షేమ శాఖ సంచాలకులకు విషయాన్ని చేరవేస్తే గంటలో సమస్య పరిష్కారమయ్యే అవకాశం ఉంది. ఆ దిశగా మునిసిపల్ కమిషనర్లు చొరవ చూపాల్సి ఉంది.

పేరుకున్న దస్త్రాలు

జనన మరణ ధృవీకరణ పత్రాల జారీలో నెలకొన్న జాప్యం కారణంగా జిల్లా వ్యాప్తంగా ఉన్న మునిసిపాలిటీల్లో పెద్ద సంఖ్యలో దస్త్రాలు పేరుకుపోయాయి. గత 40 రోజుల్లో ఒక్క చిత్తూరు కార్పొరేషన్‌లో దాదాపు 7 వేల వరకు జనన మరణ ధృవీకరణ పత్రాల జారీ చేయాల్సి ఉంటే, ఒక్కటి కూడా ఇవ్వలేదు. ఇక పలమనేరులో 5 వేలు, పుంగనూరులో 4 వేలు, నగరిలో 2 వేలు, కుప్పంలో 2 వేలు చొప్పున జిల్లా వ్యాప్తంగా 20 వేల వరకు పత్రాల జారీ ఆగిపోయింది. గతంలో ఇస్తున్న ధృవీకరణ పత్రాలపై అప్పటి సీఎం వైఎస్.జగన్ చిత్రాన్ని మార్పు చేయడానికి వీటిని ఆపినట్లు అధికారులు చెబుతున్నారు.

> **విచారిస్తా..**
>
> జనన, మరణ ధృవీకరణ పత్రాలు జారీ కావడంలేదనే విషయం ఇప్పటి వరకు నాకు తెలియదు. ఎందుకు ఆగిపోయింది, ఏం జరిగిందో సిబ్బందిని అడిగి విచారిస్తా. అవసరమైతే ఉన్నతాధికారులతో మాట్లాడి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూస్తాం. – అరుణ, కమిషనర్, చిత్తూరు మునిసిపల్ కార్పొరేషన్

తప్పిన పెను ప్రమాదం



పొలాల్లోకి దూసుకెళ్లి ఒరిగిపోయిన స్కూల్ బస్సు

వి.కోట: మరో బస్సును అధిగమించే క్రమంలో నారాయణ విద్యాసంస్థకు చెందిన బస్సు పెను ప్రమాదం నుంచి తప్పించుకుంది. దీంతో 30 మంది విద్యార్థులు సరక్షితంగా బయటపడ్డారు. స్థానికుల కథనం మేరకు, నారాయణ బస్సు వి.కోట నుంచి నక్కనపల్లెకు విద్యార్థులను తరలిస్తోంది. ఈ క్రమంలో బస్సు డ్రైవర్ అతివేగంతో వెళుతూ, నక్కనపల్లె వద్ద మరో బస్సును అధిగమించేందుకు ప్రయత్నించాడు. అయితే ఈ బస్సు రోడ్డు పక్కకు ఒరిగిపోయి పంటలోకి దూసుకెళ్లి ఆగిపోయింది. ఈ హఠాత్పరిణామానికి బస్సులో ఉన్న విద్యార్థులు ఒక్కసారిగా ఉలిక్కి పడి హాహాకారాలు చేశారు. అయితే ఎటువంటి ప్రమాదం జరగక పోవడంతో ఊపిరి పిల్చుకున్నారు. అనంతరం స్థానికుల సాయంతో బస్సులోని విద్యార్థులను కిందకు దింపారు. బస్సుకు బ్రేకులు సరిగా లేకపోవడం, నిర్లక్ష్యపు డ్రైవింగ్, అతివేగం, ఇరుకైన రోడ్డులో మరో బస్సును అధిగమించడం ఈ ప్రమాదానికి గల కారణాలుగా భావిస్తున్నారు.

యజమానినే పొడిచి చంపిన ఎద్దు



ఎద్దుతో జయచంద్ర (ఫైల్)

బైరెడ్డిపల్లె: తాను పెంచిన ఎద్దు చేతిలోనే యజమాని మృతి చెందిన విషాద సంఘటన మండలంలో బుధవారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు, సాధారణంగా మైలేరు పండుగలో వదిలిపెట్టే ఎద్దులతో ఎలాంటి వ్యవసాయ పనులు చేయించరు. మండల కేంద్రానికి చెందిన జయచంద్ర (37) కొంత కాలంగా మైలేరు ఎద్దును మేపుతూ మైలేరు పోటీలకు వెళ్తుంటాడు. ఈ క్రమంలో బుధవారం తన పొలం వద్ద ఆ ఎద్దును మేపుతుండగా ఆ ఎద్దు జయచంద్రపైనే తిరగబడి పొడిచింది. స్థానిక రైతులు గమనించి వెంటనే బైరెడ్డిపల్లె పీహెచ్‌సీకి తరలించారు. పరిశీలించి అయితే అప్పటికే జయచంద్ర మృతి చెందినట్లు వైద్యాధికారి నిర్ధారించారు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

నిత్యావసర ధరల నియంత్రణకు చర్యలు



మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలో నిత్యావసర వస్తువుల ధరల నియంత్రణకు చర్యలు చేపడుతున్నట్లు జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు తెలిపారు. కలెక్టరేట్‌లో బుధవారం నిత్యావసర వస్తువుల హోల్‌సేల్ అసోసియేషన్ డీలర్ల తో సమీక్ష నిర్వహించారు. జేసీ మాట్లాడుతూ బహిరంగ మార్కెట్‌లో పెరుతున్న బియ్యం, కందిపప్పు, నూనె ధరన నియంత్రణకు రైతుబజార్‌లలో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఆ కౌంటర్లలో స్టీమ్ బియ్యం కిలో రూ.49, పచ్చి బియ్యం కిలో రూ.48, నాణ్యమైన కందిపప్పు, నూనె హోల్‌సేల్ ధరలకు విక్రయించేందుకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. హోల్‌సేల్ అసోసియేషన్ డీలర్లు మాట్లాడుతూ ఈ నెల 11వ తేదీ నుంచి కింద తెలిపిన కౌంటర్లలో అమ్మకాలు ప్రారంభం అవుతాయన్నారు. చిత్తూరు నగరంలోని రైతుబజార్‌లో(బియ్యం, కందిపప్పు), చర్చివీధిలోని వినాయకస్టోర్స్‌లో (కందిపప్పు), ఎఫ్‌ఎం ఎస్ ట్రేడర్స్, కల్లూరులో (కందిపప్పు), ప్రభు ఇండస్ట్రీస్ పుంగనూరులో (కందిపప్పు), రైస్ మర్చంట్ అసోసియేషన్ నగరిలో (బియ్యం, కందిపప్పు), కృష్ణమూర్తి స్టోర్స్ హైరోడ్డు చిత్తూరులో (బియ్యం), గుప్త స్టోర్స్ హైరోడ్డు చిత్తూరులో (బియ్యం), బాలాజీ ట్రేడర్స్ బజార్ వీధి చిత్తూరులో (బియ్యం) అందుబాటులో ఉంటాయన్నారు. సమావేశంలో జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి శంకరన్, పౌరసరఫరాల శాఖ డీఎం మోహన్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

ఆరంభం.. సాక్షాత్కార వైభవం



వాహన సేవలో పాల్గొన్న ఆలయ అధికారులు, భక్తులు



వాహన సేవ ముందు కళాకారుల ప్రదర్శన

చంద్రగిరి : శ్రీనివాసమంగాపురంలోని శ్రీకల్యాణ వేంకటేశ్వర స్వామివారి ఆలయంలో సాలకట్ల సాక్షాత్కార వైభవోత్సవాలు బుధవారం ప్రారంభమయ్యాయి. మూడు రోజుల పాటు కొనసాగనున్న ఉత్సవాల్లో భాగంగా వేకువజామునే సుప్రభాతంతో స్వామివారిని మేల్కొలిపి, తోమాలసేవ, కొలువు, పంచాంగ శ్రవణం, సహస్రనామార్చన నిర్వహించారు. ఉదయం 10 నుంచి 11 గంటల వరకు ఆలయ ముఖ మండపంలో శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామివారి ఉత్సవర్లకు స్నపన తిరుమంజనం జరిపించారు. పాలు, పెరుగు, తేనె, పసుపు, చందనం, కొబ్బరినీళ్లతో అభిషేకం చేశారు. రాత్రి 7 గంటలకు పెద్దశేష వాహనంపై స్వామివారు ఆలయ మాడ వీధుల్లో విహరిస్తూ భక్తులకు దర్శనమిచ్చారు. రెండో రోజు గురువారం హనుమంత వాహనంపై, మూడో రోజు శుక్రవారం గరుడ వాహనంపై స్వామివారు ఊరేగనున్నారు. కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఈఓ వరలక్ష్మీ, ఏఈఓ గోపీనాథ్ పాల్గొన్నారు.

దోపిడీ కేసును చిత్తూరు కోర్టుకు పంపిన జడ్జి

- నిందితులకు శిక్ష విధించిన కోర్టు



జడ్జి గ్రంధి శ్రీనివాస్

తిరుపతి లీగల్ : తిరుపతి అలిపిరి పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన దోపిడీ కేసు తీవ్ర నేరమైనదిగా భావించి తిరుపతి 4వ అదనపు జూనియర్ జడ్జి గ్రంధి శ్రీనివాస్, చిత్తూరు ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి కోర్టుకు ఈ ఏడాది మార్చి 27న పంపినట్టు తిరుపతి 4వ అదనపు జూనియర్ జడ్జి కోర్టు సూపరింటెండెంట్ సుబ్బారెడ్డి బుధవారం మీడియాకు తెలిపారు. వివరాల్లోకి వెళ్తే.... తమిళనాడుకు చెందిన తంగం రాజా, దొరైస్వామి తిరుపతి, ఖాజా మొహిద్దీన్ గత ఏడాది అక్టోబర్ 11వ తేదీ రాత్రి 10:30 గంటల ప్రాంతంలో అలిపిరి బస్టాండ్ సమీపంలో తిరుపతి మంగళం చెందిన పి అనిష్‌పై మారణాయుధాలతో దాడి చేసి అతని వద్ద ఉన్న సొమ్ము, వస్తువులను దోచుకెళ్లారు. అప్పట్లో బాధితుడి ఫిర్యాదు మేరకు అలిపిరి పోలీసులు నిందితులను అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరిచారు. జడ్జి గ్రంధి శ్రీనివాస్ మొత్తం కేసును విచారణ చేశారు. వారు తీవ్రమైన నేరానికి పాల్పడ్డారని, జూనియర్ జడ్జి కోర్టు విధించే శిక్షా కాలం కంటే వారికి ఎక్కువ శిక్ష విధించాల్సి ఉందని భావించారు. దీంతో కేసును చిత్తూరు ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి కోర్టుకు విచారణ నిమిత్తం బదిలీ చేస్తూ తీర్పు చెప్పారు. దీంతో చిత్తూరు ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి ఎఫ్‌ఏసీ అదనపు సీనియర్ సివిల్ జడ్జి కేసు పూర్వాపరాలను మరోసారి పరిశీలించి నిందితులకు ఐదు సంవత్సరాల ఆరునెలలు జైలు శిక్ష విధించడంతోపాటు ఒక్కొక్కరికి రూ.3వేల చొప్పున జరిమానా విధిస్తూ తీర్పు చెప్పినట్లు ఆయన తెలిపారు.

ఆరోగ్యంపై అవగాహన ముఖ్యం



జనాభా దినోత్సవ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి అర్బన్: ఆరోగ్యంపై అందరూ పూర్తి అవగాహన కలిగి ఉండాలని కలెక్టర్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్ అన్నారు. కలెక్టరేట్‌లో వైద్యాధికారులతో కలసి ప్రపంచ జనాభా దినోత్సవ పోస్టర్లను ఆవిష్కరించి ఆయన మాట్లాడారు. పాఠశాలలు, కళాశాలల నుంచే ఆరోగ్యంపై అవగాహన కల్పించాలని ఆదేశించారు. తల్లి, బిడ్డ శ్రేయస్సు కోసం సరైన సమయంలో గర్భధారణ, బిడ్డకు–బిడ్డకు మధ్య అంతరం, బాల్య వివాహాల మూలాన కలిగే అనర్థాలు..ఇత్యాది అంశాలపై కుటుంబ ప్రణాళిక ఉండాలన్నారు. ఆ ప్రణాళికే అభివృద్ధి చెందుతున్న భారత దేశానికి గుర్తింపు అని పేర్కొన్నారు. డీఎంహెచ్‌ఓ డాక్టర్ శ్రీహరి, వైద్యాధికారులు శ్రీనివాసరావు, లావణ్య, వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు ఎస్వీయూలో నాన్ టీచింగ్ అసోసియేషన్ ఎన్నికలు

తిరుపతి సిటీ: ఎస్వీయూ నాన్‌టీచింగ్ అసోసియేషన్ ఎన్నికలు గురువారం వర్సిటీ ఆవరణలో నిర్వహించనున్నట్లు ఎన్నికల అధికారి షఫీ ఒక ప్రకటనలో తెలిపారు. 32 మంది సభ్యులకు గాను ఇప్పటికే 17మంది ఏకగ్రీవంగా ఎన్నికయ్యారని తెలియజేశారు. అధ్యక్ష పదవి, కార్యదర్శి పదవికి ముగ్గురేసి చొప్పున, మరో 9 విభాగాలకు సంబంధించి 33 మంది బరిలో ఉన్నట్లు పేర్కొన్నారు. గురువారం ఉదయం 8 నుంచి 2 గంటల వరకు జరగనున్న ఎన్నికలలో సుమారు 464మంది ఉద్యోగులు ఓటు హక్కు వినియోగించుకోనున్నట్లు తెలిపారు. మధ్యాహ్నం 3గంటలకు కౌంటింగ్ ప్రారంభించి సాయంత్రానికి ఎన్నికల ఫలితాలు వెల్లడించనున్నట్లు ఆయన తెలిపారు.

ప్రేక్షకులను రప్పించడమే పెద్ద సవాల్

- సామాజిక స్పృహతో శంకర్ సినిమాలు
- సినీ నిర్మాత సురేష్ బాబు



శ్రీవారిని దర్శించుకున్న సినీ నిర్మాత సురేష్ బాబు, మలినేని గోపీచంద్, తమన్

తిరుమల: సినిమా టికెట్ల ధర పెంపుపై డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ సానుకూలంగా స్పందించారని, అయితే ప్రస్తుతం టిక్కెట్ల ధర కంటే ప్రేక్షకులను సినిమాకు రప్పించడమే తమ ముందు ఉన్న పెద్ద సవాల్ అని ప్రముఖ సినీ నిర్మాత సురేష్ తెలిపారు. బుధవారం ఉదయం వీఐపీ విరామ సమయంలో ఆయన శ్రీవారిని దర్శించుకున్నారు. ఆయనతోపాటు డైరెక్టర్ మలినేని గోపీచంద్, సంగీత దర్శకుడు తమన్ కూడా దర్శించుకున్నారు. దర్శనానంతరం అధికారులు పట్టువస్త్రంతో సత్కరించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఆ తర్వాత ఆలయం వెలుపల ఆయన మీడియాతో మాట్లాడారు. శంకర్ దర్శకత్వం వహించిన భారతీయుడు 2 చిత్రాన్ని తెలుగులో విడుదల చేస్తున్నట్టు చెప్పారు. సామాజిక స్పృహతో శంకర్ తీసే చిత్రాల తరహాలోనే ప్రతి ఒక్కరూ సమాజం కోసం తమవంతు బాధ్యతగా పని చేయాలని కోరారు.

నాణ్యంగా..రుచిగా అన్నప్రసాదం

తిరుమల: దేశ విదేశాల నుంచి ప్రతి రోజు శ్రీవారి దర్శనానికి విచ్చేసే వేలాది మంది భక్తులకు నాణ్యంగా, రుచికరంగా అన్న ప్రసాదాలు అందిస్తున్నట్లు టీటీడీ ఈఓ జె.శ్యామలరావు తెలిపారు. తిరుమలలోని మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ అన్నప్రసాద కేంద్రాన్ని జేఈఓ వీరబ్రహ్మంతో కలిసి బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఈఓ మీడియాతో మాట్లాడుతూ, తిరుమలలో ప్రతిరోజు 2 లక్షల మందికి అన్న ప్రసాదాలు అందిస్తున్నామన్నారు. భక్తులకు మరింత నాణ్యమైన, రుచికరమైన అన్న ప్రసాదం అందించేందుకు మరిన్ని చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు. ఇందులో భాగంగా అన్నప్రసాద భవనంలో 15 ఏళ్ల క్రితం ఏర్పాటు చేసిన ఆహార తయారీ యంత్రాలను మార్చి కొత్తవి అందుబాటులోకి తీసురావాల్సిన అవసరం ఉందని చెప్పారు. అన్నప్రసాద విభాగంలో పనిచేస్తున్న సిబ్బందిని పెంచనున్నట్లు తెలిపారు. ఇందుకోసం దేశంలోని ప్రముఖ చెఫ్‌లు, క్యాటరింగ్ నిపుణులతో ఏర్పాటు చేసిన కమిటీ సమగ్ర నివేదిక సమర్పించిందన్నారు. ఇందుకు అనుగుణంగా చర్యలు తీసుకోనున్నట్లు ఈఓ వివరించారు. అన్నప్రసాద విభాగంలో టీటీడీ ఉద్యోగులు చక్కగా సేవలందిస్తున్నారని అభినందించారు. కార్యక్రమంలో క్యాటరింగ్ ప్రత్యేక అధికారి శాస్త్రి పాల్గొన్నారు.

వాహన చోరీ కేసుల్లో ఆరుగురి అరెస్టు



నిందితుడిని అరెస్టు చూపుతున్న సీఐ మల్లేష్ యాదవ్

రామకుప్పం: వాహన చోరీ కేసుల్లో ఆరుగురిని అరెస్టు చేసిన సంఘటనలు బుధవారం వెలుగుచూశాయి. మండల కేంద్రంలోని దిగువవీధిలో గత నెల 30వ తేదీ తెల్లవారుజామున గురుప్రసాద్‌కు చెందిన మిని టెంపో చోరీకి గురైనట్లు పోలీసులకు ఫిర్యాదు అందింది. ఈ క్రమంలో ఆంధ్ర–తమిళనాడు సరిహద్దు ప్రాంతమైన ఆరిమానుపెంట సమీపంలో కుప్పం రూరల్ సీఐ మల్లేష్ యాదవ్ ఆధ్వర్యంలో బుధవారం పోలీసు సిబ్బంది వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ తనిఖీల్లో పోలీసులను చూసి ముగ్గురు వ్యక్తులు పారిపోతుండగా వారిని పట్టుకుని విచారించగా మిని టెంపోను దొంగిలించినట్లు తేలిందని పోలీసులు తెలిపారు. అరెస్టు అయిన వారిలో తమిళనాడుకు చెందిన ప్రభు, ఏరుగుత్తికి చెందిన పళని, పరదరామి గ్రామానికి చెందిన వాహిద్ మాలిక్ ఉన్నారు. వీరి నుంచి మినీ టెంపోను స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. ఈ కేసులో నిందితులను పట్టుకోవడంలో ప్రతిభ కనబరిచిన పోలీసు సిబ్బందికి ఉన్నతాధికారులు నగదు బహుమతి అందజేశారు.

బైక్ చోరీ కేసులో ముగ్గురి అరెస్టు

గంగాధర నెల్లూరు: మండల కేంద్రంలోని జగనన్న కాలనీలో బైక్ చోరీ కేసులో ముగ్గురు యువకులను అరెస్ట్ చేసినట్లు ఇన్‌చార్జి సీఐ లక్ష్మన్న పేర్కొన్నారు. స్థానిక పోలీస్ స్టేషన్లో బుధవారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆయన తెలిపిన వివరాల మేరకు, గంగాధర నెల్లూరులోని జగనన్న కాలనీలో గత నెల 25వ తేదీ మణిగండన్‌కి సంబంధించిన మోటార్ సైకిల్ చోరీ అయింది. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేసి తమిళనాడులోని తిరువణ్ణామలై జిల్లాకు చెందిన అసనంపేటకు చెందిన పి.దినేష్, ఆర్.అన్నామలై, వడనంబాకంకు చెందిన యం.కరుణాకర్‌ను నిందితులుగా గుర్తించారు. వారిని బుధవారం అరెస్టు చేసి, బైక్ స్వాధీనం చేసుకున్నారు. తమిళనాడులో ఈ బైక్ దొంగలపై పలు కేసులు ఉన్నట్లు సీఐ తెలిపారు. ఈ కార్యక్రమంలో తాలుకా ఎస్‌ఐ ఉమామహేశ్వర రెడ్డి, స్థానిక పోలీసులు గజేంద్ర, గోపాల్ పాల్గొన్నారు.